శిథిలాలను ఎలా తరలిద్దాం?

- హైడ్రాకు తలనొప్పిగా మారిన కూల్చివేతలు
- నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ఖాళీ స్థలాల అన్వేషణ
- ప్రణాళిక లేని హడావిడి.. హైడ్రాకు కలవరం
- ఎక్కడి శిథిలాలు అక్కడే.. తొలగింపుపై నిమ్మ నీరెత్తిన హైడ్రా
- తరలింపుపై నిర్ణయం తేలక.. కుప్పలు తెప్పలుగా శిథిలాలు

సిటీబ్యూరో, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లు, అక్రమ నిర్మాణాలని ఇండ్లు, పలు భవంతులను కూల్చి సామాన్యుల జీవితాలను చిన్నా భిన్నం చేసిన హైడ్రా (కాంగ్రెస్ ప్రభుత్వం) శిథిలాల తరలింపునకు ఇప్పుడు వెతుకులాట మొదలు పెట్టింది. హైడ్రా ఆక్రమణల తొలగింపు నుంచి ప్రభుత్వం ఖాళీ స్థలాల కోసం అన్వేషిస్తోంది. కూల్చివేతల శిథిలాల తరలింపు కోసం ఖాళీ జాగా ఎక్కడుందా? అని రెవెన్యూ సహకారంతో వెతుకుతోంది. పక్కా ప్రణాళిక లేకుండా హడావిడిగా చేసిన పని ఇప్పుడు హైడ్రాను కలవరపెడ్తోంది. హైదరాబాద్‌లో పలు చెరువులు, కుంటలు, పార్కుల వద్ద హైడ్రా చేపట్టిన కూల్చివేతల శిథిలాల తరలింపు ప్రక్రియ ఇప్పుడు ఆ సంస్థకు పెద్ద తలనొప్పిగా మారింది. హైడ్రా 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసింది. సున్నం చెరువు, నల్ల చెరువు, అప్ప చెరువు.. ఇలా కూల్చిన ప్రతిచోటా శిథిలాలు అలాగే పడి ఉన్నాయి. కూల్చివేతలకు సంబంధించి శిథిలాల తొలగింపు ప్రక్రియపై హైడ్రా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఎలాంటి ప్లానింగ్ లేకుండా కూల్చివేతలే లక్ష్యంగా సామాన్యుల నిర్మాణాలపై బుల్డోజర్లను పంపింది. ఇదంతా రెండు నెలల్లో జరిగిన ప్రక్రియ. కోర్టు జోక్యంతో హైడ్రా తాత్కాలికంగా ఆగినా.. కూల్చివేతలకు సంబంధించిన శిథిలాలు అందునా పెద్ద పెద్ద దూలాలు, కర్రలు, పెద్ద రాళ్లు ఎక్కడివక్కడే పడేసి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలాల తొలగింపునకు సంబంధించి సెప్టెంబర్‌లో హైడ్రా టెండర్లను పిలిచినా.., వాటికి సంబంధించి ఇప్పటివరకు ఏ కంపెనీ ఫైనల్ కాకపోవడంతో ఇక తమ పరిధిలోనే తొలగింపు ప్రక్రియ చేపట్టింది. శిథిలాల తొలగింపు, తరలింపునకు సంబంధించిన వ్యయాన్ని నిర్మాణదారులే భరించాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అయితే, శిథిలాలు ఎక్కడ పోయాలనేది మాత్రం ఇప్పటివరకు తేల్చుకోలేకపోవడంతో తరలింపు ప్రక్రియ ఎక్కడిదక్కడే నిలిచిపోయింది.

శిథిలాల తరలింపునకు స్థలమెక్కడ..!

హైడ్రా బృందం చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాలు ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలను, పార్కు స్థలాల్లో వెలిసిన పలు నిర్మాణాలు నేలమట్టం చేశారు. లోటస్ పాండ్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గాజుల రామారం, బాచుపల్లి, చందానగర్, రాజేంద్రనగర్, ఆమీర్‌పేట, అమీన్‌పూర్, గుట్టల బేగంపేట, మల్లంపేటలలో కట్టడాలు కూల్చడంతో భారీగా నిర్మాణ వ్యర్థాలు పోగయ్యాయి. వీటిని తరలించడానికి కోట్ల రూపాయలు కావాలి. కూల్చిన చెరువుల దగ్గర ఫెన్సింగ్ చేస్తేనే తిరిగి ఆక్రమణలు జరగవని హైడ్రా అధికారులు అంటున్నారు. కుంచించుకుపోయిన వాటిని పునరుద్ధరించాలంటే తవ్వకాలు జరిపి పూర్వ ఆకారాన్ని తీసుకురావలసి ఉంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైడ్రా వద్ద నిధులేవు. ఆర్‌ఆర్ చట్టం కింద నిర్మాణ వ్యర్థాలను తరలించడానికి అయ్యే వ్యయాన్ని నిర్మాణదారుల దగ్గరే వసూలు చేయడానికి హైడ్రా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎర్రగుంట చెరువు వద్ద కూల్చేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే క్రమంలో బిల్డర్ తనకు సంబంధించిన విలువైన వస్తువులను హైడ్రా బృందం తరలిస్తుందంటూ వీడియో వైరల్ చేశారు. దీంతో ఆ తుక్కు తరలించడమే కాకుండా అది అమ్మగా పోను మిగతా వ్యయాన్ని బిల్డర్ దగ్గర నుంచే వసూలు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అయితే, శిథిలాలను ఎక్కడ వేయాలనే దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. ఒక్క ఎర్రగుంట చెరువు వద్ద కూల్చేసిన వ్యర్థాలను తరలించాలంటేనే చాలా కష్టమైంది. ఇక మిగిలిన చోట పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై హైడ్రా బృందం తర్జనభర్జన పడుతున్నారు. ఓఆర్‌ఆర్ పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు ఉండి అక్కడ కూల్చివేతల శిథిలాలు పోసే అవకాశముంటుందా? అనే దిశగా ఆయా ప్రాంతాల ఎమ్మార్వోలతో హైడ్రా బృందం చర్చిస్తోంది. అయితే, స్థలాల ఎంపిక ప్రక్రియే ప్రస్తుతం హైడ్రాకు పెద్ద తలనొప్పిగా మారింది. కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా కూడా సర్వే చేసినట్లు తెలిసింది. శిథిలాలను పోయడానికి కావలసిన స్థలం కోసం ప్రస్తుతం హైడ్రా బృందం ప్రయత్నిస్తోంది. తాము బెంగళూరు స్టడీ టూర్ వెళ్లి వచ్చేలోగా కనీసం నాలుగు చెరువులకు సంబంధించిన వ్యర్థాలను పోయడానికి అనువైన స్థలం కావాలంటూ రెవెన్యూ అదికారులకు కమిషనర్ చెప్పారు. శిథిలాల తొలగింపు ప్రక్రియ జరిగితేనే చెరువుల సుందరీకరణ సాధ్యమవుతుంది.

టెండర్లు ఏమయ్యాయి..!

కూల్చివేతలు, తొలగింపులకు సంబంధించి హైడ్రా సెప్టెంబర్ నెలలో ఆఫ్‌లైన్ టెండర్లను పిలిచింది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 27తో ముగిసింది. అయితే, ఇప్పటివరకు ఏ సంస్థకు టెండర్లు ఫైనల్ కాలేదని తెలిసింది. మూడు నెలల కాలంలో హైడ్రా జరిపిన కూల్చివేతలకు సంబంధించిన శిథిలాలు ఎక్కడివక్కడే పడేసి ఉన్నాయి. శిథిలాల తొలగింపు ప్రక్రియ పెద్ద టాస్క్‌గా మారింది. కూల్చివేతలతో పాటు శిథిలాలను తరలించే ప్రక్రియకు సంబంధించే టెండర్లను పిలిచినప్పటికీ కంపెనీలు ఏవీ సుముఖంగా లేకపోవడంతో హైడ్రానే ముందుగా ఎర్రగుంట చెరువు వద్ద తరలింపు ప్రక్రియ చేపట్టింది. కానీ, ఈ తరలింపులో ఇబ్బందులున్నట్లు గమనించింది. శిథిలాలను ఎక్కడ పోయాలో తెలియక ఎర్రగుంట వద్ద తరలింపు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. తాము చెప్పినట్లుగా ఎర్రగుంట చెరువు, సున్నం చెరువు, అప్ప చెరువు, నల్ల చెరువులను ఆరు నెలల్లో సుందరీకరించడానికి మొదటి ఘట్టమే అక్కడ కూల్చివేసిన నిర్మాణ వ్యర్థాలను తరలించడం. ఇదే ఆలస్యమవుతుండంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమ బృందంతో పాటు రెవెన్యూ, ఇతర శాఖలతో సమావేశమయ్యారు. తమ పరిధిలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలున్నాయో చెప్పాలని, నిర్మాణ వ్యర్థాలు పోసే అవకాశముంటుందా? లేదా? కూడా ఫైనలైజ్ చేయాలని చెప్పినట్లు సమాచారం. వచ్చే వారంలో తాము బెంగళూరు స్టడీ టూర్‌కు వెళ్లివచ్చే లోగా స్థలాల ఎంపిక జరగాలని కమిషనర్ చెప్పినట్లు తెలిసింది.

పూల సాగు విస్తరించాలి

ఉద్యాన వర్సిటీ వీసీ డి.రాజిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 02: తెలంగాణలో పూలసాగు విస్తరించాలని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ ఉప కులపతి డా. దండా రాజిరెడ్డి అన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టి తొలిసారి నగరానికి వచ్చిన ఆయనకు రాజేంద్రనగర్ పూల పరిశోధనా విభాగాన్ని ఆయన సందర్శించారు. డిపార్టుమెంట్ హెడ్ సీనియర్ సైంటిస్టు డా. గాదె జ్యోతి ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల విభాగంలో గంటపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే పూల సాగుకు తెలంగాణ నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలమన్నారు. పూల సాగు విస్తరణ పెంచేందుకు ఒక ప్రణాళికను తయారు చేయాలని, బంతి నారు, చామంతి , మల్లె, లిల్లీ, ఇతర అలంకారణ మొక్కలను, రైతులకు సరిపడే మొక్కలను తయారు చేయాలని సూచించారు. ఇప్పటికే నగర సమీపంలోని అధిక రైతులు పూల సాగువైపు మొగ్గుచూపుతున్నారని డిపార్టుమెంట్ హెడ్ జ్యోతి గుర్తు చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డా. భగవాన్, డీఆర్ డా. లక్ష్మీనారాయణ జోనల్ హెడ్ సురేష్ కుమార్ . కళాశాల అసోషియేట్ డీన్ ప్రశాంత్, డా. వీణ , సల్మా, డా. ప్రణీత్ కుమార్ బోదనా , బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో ఓయూ వీసీ భేటీ

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 2: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌కు ఆయన ఘనంగా సన్మానం చేశారు. వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని సీఎంను ప్రొఫెసర్ కుమార్ కోరారు. ఓయూ ప్రతిష్టను పెంపొందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వర్సిటీలో విద్యా వాతావరణం పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు.

జాతి సమగ్రతను కాపాడాలి

రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

నెక్లెస్ రోడ్‌లో ఇంటిగ్రిటీ వాకథాన్

ఖైరతాబాద్, నవంబర్ 2: దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఇంటెగ్రిటీ వాకథాన్‌ను నిర్వహించారు. ఈ వాకథాన్‌ను రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా పలు విద్యా సంస్థల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. దేశంలోని పౌరులంతా జాతి సమగ్రతను కాపాడేందుకు కంకణ బద్ధులై ఉండాలన్నారు. అనంతరం, జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 'కల్చర్ ఆన్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' అనే అంశంపై నిర్వహించిన క్యారికేచర్ పెయింటింగ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ వినయన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్ పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనతో బడుగుల జీవితాల్లో మార్పు

జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్

ఖైరతాబాద్, నవంబర్ 2: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కులగణన ద్వారా బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వీరశైవ లింగాయత్, లింగ బలిజ తదితర పేర్లతో పిలువబడే లింగాయత్‌లు తమ పేర్లను కులగణనలో నమోదు చేసుకోవాలని, అందుకు సంఘం ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్, దీనేశ్ పాటిల్, హన్మంత్ రావు, శెట్టి శివ కుమార్, రాచప్ప, శివ కిరణ్, మధు, రఘు, రాకేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ వేడుక..

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవపల్లి డివిజన్ పరిధిలో సదర్ సమ్మేళనం శనివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మైలార్‌దేవపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు దున్నలను అందంగా ముస్తాబు చేసి డీజే పాటలతో నృత్యాలు చేయిస్తూ సదర్ సమ్మేళనంలో పాల్గొన్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 2;

సదర్ సమ్మేళనం అదుర్స్..

హిమాయత్‌నగర్, నవంబర్ 2: నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దున్న పోతుల విన్యాసాలు, డప్పుల దరువుకు కళాకారుల నృత్యాలు, ఆట పాటలతో నారాయణగూడ ప్రాంతం దద్దరిల్లింది. దున్న పోతులు చేసిన వీరంగాన్ని తిలకించిన చిన్నారులు, మహిళలు ఆనంద పరవశులయ్యారు. ఈ ఉత్సవాలల్లో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను పరిశీలించిన హైడ్రా డీసీ

అక్రమ నిర్మాణాల వివరాలను తెలుసుకుంటున్న హైడ్రా డిప్యూటీ కలెక్టర్ విజయ్ కుమార్

మాదాపూర్, నవంబర్ 2: మాదాపూర్‌లోని సర్వే నం. 41/14 లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండటంతో ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా సీపీఎం పార్టీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్‌లోని సర్వే నం. 41/14లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా డిప్యూటీ కలెక్టర్ విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీపీఎం పార్టీ నాయకులు సర్వే నం. 41/14లో మొత్తం 250 ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం పలు సంస్థలకు కేటాయించినదని, సుమారు 70 ఎకరాల భూమి ఇంకా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికీ వాటిపై అనుమతులు తీసుకొని ప్రభుత్వ భూములనే లక్ష్యంగా చేసుకుంటూ ప్రైవేట్ సర్వే నం. వేసి 41/14లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. గతంలో రెవెన్యూ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్ళినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా ఉందన్నారు. హైడ్రా పై తమకు పూర్తి నమ్మకం ఉందని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ కలెక్టర్ విజయ్ కుమార్ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో సీపీఎం నాయకులు శోభన్, కృష్ణ ఉన్నారు.

అమరుల వర్ధంతి సభలను జయప్రదం చేయండి

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు

విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 2: ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న విప్లవ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్ధంతి సభల వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విప్లవ విద్యార్థి ఉద్యమ గమనంలో అనేక మంది విప్లవ విద్యార్థి రత్నాలు అమరులయ్యారని చెప్పారు. కామ్రేడ్ జార్జిరెడ్డి ఓయూ కేంద్రంగా అమరత్వం పొందిన తొలినాళ్లలో ప్రగతిశీల భావజాల వ్యాప్తి కోసం ముందుకు వచ్చిన జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ను రాజ్యం బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసిందని ఆరోపించారు. వారి ఆశయాల కొనసాగింపులో భాగంగా మరింత మంది అమరత్వం పొందారని గుర్తు చేశారు. విప్లవ విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ వర్ధంతి సభలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నవీన్, తీగల శ్యామ్, ఝాన్సీ, యశ్వంత్, ఆసిఫ్, సంతోష్, సైదులు, రాము పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో సదర్..

ముషీరాబాద్, నవంబర్ 2: ముషీరాబాద్‌లో సదర్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, ఈటెల రాజేందర్, శాసన మండలి బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎంఎన్ శ్రీనివాస రావు, ముఠా జయసింహ, శ్రీనివాస్ రెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

నేటి బాలలే.. రేపటి పౌరులు: డా. కేవీ రమణాచారి

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, సినీ గేయ రచయిత అశోక్ తేజ, ఆహ్వానం సంఘం అధ్యక్షుడు సీహెచ్ వేణుగోపాల్ రెడ్డిలు

చిక్కడపల్లి, నవంబర్ 2: నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ఉందని మాజీ ప్రభుత్వ సలహాదారుడు, తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతర ఆహ్వానం సంఘం చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 22, 23వ తేదీలలో బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా నిలయంలో నిర్వహించే తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతరకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆహ్వాన సంఘం చైర్మన్ కేవీ రమణాచారి, సినీ గేయ రచయిత అశోక్ తేజ, ఆహ్వానం సంఘం అధ్యక్షుడు సీహెచ్ వేణుగోపాల్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం, రమణాచారి మాట్లాడుతూ, పిల్లల క్రమశిక్షణ, వారి ఆలోచన ధోరణి బాగుంటే ఈ సమాజాకి ఎంతో మేలు చేస్తారని అన్నారు. ఆ దిశగా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ఉత్సవం సఫలీకృతం కావాలని ఆశించారు. ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతరలో 300 పాఠశాలల నుంచి 10,000 మంది పిల్లలు హాజరు అవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ సంపాదకులు వినయ్ కుమార్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్ సోల్స్ డే.. సందర్భంగా నగరంలోని పలు చర్చిలలో క్రైస్తవులు ఆత్మీయుల మనశ్శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ బోయిగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డు చర్చిలో ప్రార్థనలు చేసి బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. పలు స్మశాన వాటికల్లో ఆత్మీయుల సమాధులపై పుష్పాలు అలంకరించి బాష్పాంజలి ఘటించారు.

హోం గార్డుల సతీమణుల దీక్ష భగ్నం

చిక్కడపల్లి, నవంబర్ 2: హోం గార్డులకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద హోంగార్డుల భార్యలు భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చారు. హోం గార్డుల సంఘం అధ్యక్షుడు సకినాల నారాయణ ఇచ్చిన శాంతి దీక్ష పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా నుంచి ఇద్దరు హోంగార్డుల భార్యలు వచ్చారు. ఇతర విభాగాల ఉద్యోగుల మాదిరిగానే తమతో సీఎం చర్చించి హామీలను నెరవేర్చాలని వారు భీష్మించారు. శాంతి దీక్ష నిమిత్తం ధర్నా చౌక్‌కు రావడంతో పోలీసులు అరెస్టు చేసి దోమలగూడ పీఎస్‌కు తరలించారు. పోలీసులు వారి వివరాలను సేకరించి హోంగార్డుల భార్యలు అమిలి రజిత, స్వప్నలతో పాటు వారి వెంట వచ్చిన బంధువు సుధాకర్‌ను సైతం పోలీసులు అరెస్టు చేశారు.